# త్యాగి

'నామాట వినరా, నాయనా'

'అమ్మా, యీవొక్క విషయంలోమాత్రం నన్ను విడిచిపెట్టు. చిన్నప్పటినుంచీ నిన్నుకాదని యేపనైనా చేశానా? తల్లివగు నువ్వు నాకు యీమాత్రం స్వాతంత్ర్యం యివ్వకపోతే ఎలా'

'నేడో రేపో అనికూచున్న యీ ముసలి ప్రాణాన్ని శాంతంగా పోనీక, అంత్యకాలాన్ని లేనిపోని కలతల పాల్జేస్తూన్నావురా, బాబూ'

'నేనేం చేశానే'

'ఏంచేశావూ, చెప్పినట్టు చెయ్యకపోవడమే. అది చాలదూ.'

'యీ విషయంవల్లవచ్చే ఫలితాలకు బాధ్యుణ్ణి నేనూ—అంచేత దీన్నిగురించి యెక్కువగా యోచించవలసిన వాణ్ణికూడా నేనే అయివున్నాను— —ఇంతేనా—'

'నాకుమాత్రం అవసరంలేదూ నీ కష్టసుఖాలు—ఏదో నే బ్రతికివుండగా ఒకయింటివాడివైతే చూచి ఆనందించాలని నాకూ—'

'అలానే కానీ, యీ మాఘంలో చేసికుంటానన్నా గా—ఏదో సంబంధంచూచి'—

'బాగుంది, ఏదో శాస్త్రంచెప్పినట్టూ—బంగారం లాంటి పిల్లను వదిలేసి-నువ్వ సుఖఃడితేచాలు అని కాదూ కట్నాల కాశవదలుకుని యీ సమ్మంధంకుదిర్చా'

'అప్రను నా శ్రేయస్సు కోరే—'

'మరి ఇహనే, పోనీగుణాల్లో అంటావా—యీ కలియుగంలో లేదు అటువంటి సుగుణవతి—విద్యలో నా యిక అపరసరస్వతే—ఎన్నినోములు నోచుకోవాలా అలాటిపిల్లను చేసికోడానికీ—'

'నాజీవితం అంతా ధారపోసినా అట్టిబాలికను పొందలేనన్న మాట నిజమేనమ్మా—ఆమె సౌందర్య దేవతనీ—సుగుణాల ప్రోవనీ—చదువుకున్నదనీ—నాకూ తెలుసును. అంచేతనే ఆమెను వివాహంచేసికోడానికి నామన స్సంగీకరించకుండా వుంది'

'ఏం'

'పాపం, ఆపేదబాలిక జీవితాన్నంతా దగ్ధం చేయడం భావ్యంకాదనీ'—

'దగ్ధంచెయ్యడమేమిటి'

'అప్రను ఆమె నీకుమార్తెయై—నాలాటి కురూపికివ్వవలసివస్తే తెలుస్తుంది నీ కావిషయం స్పష్టంగా'

'ఎక్కడైనా వుందా యీయిద్దూరం—వస్తూవున్న లక్ష్మిని కాలితో తన్నివేయడం'

'ఎక్కడా లేదని మనం అన్యాయంగా వర్తించడం ధీరత్వం కాదమ్మా'

'అన్యాయం ఏంవుంది దీనిలోనూ'—

'ఆకాశాన్ని వుండవలసిన దివ్యతారకల్ని అధోలోకానికి త్రోచివెయ్యడం అన్యాయంకదూ—అర్హుడగు యువకునితో సౌఖ్యాన్ని ఓలలాడవలసిన ఆ అమాయకపు బాలికను నావంటి కురూపికి అంటగట్టి దుఃఖభాజనిని చేసివేయడం అన్యాయంకాదూ.'

'ఏమిటీ రాద్ధాంతాలన్నీని—ఆపిల్ల వొప్పుకుంటూంటేని'

'బీదవాళ్ళవడంచే ధనవంతుల యింట్లో పడితే సుఖపడుతుందని తల్లి తలుస్తోంది. ఆమాత్రపువివేకంవున్న ప్రేమాతిశయాలచే పిల్ల సమ్మతిస్తోంది?

'నాకివన్నీ తెలీవు—ఆపిల్లను చేసికొని తీరాలి'

*        *        *

'బాబూ యీబీదపిల్లను చేసికునేవారెవరూ?'

'ఎవరా, యీసౌందర్యరాశికై పడిగాపులుపడి వుండని వారెవరు?'

'ఏదో మాయందు దయచే అలాఅంటారు—మరి మాలాటి బీదవానికే యిస్తే యిహ చెప్పనవసరమే లేదు కదా—ఇహ నెవరున్నారూ నాయనా.'

'మీరు తుచ్ఛమైన ఐశ్వర్యానికి ఆశించి పిల్ల యొక్క క్షేమాన్ని యోచించడంలేదు. ఒక్క ధనం మూలాన్నే ఆమె సుఖిస్తుందని తలుస్తోన్నారు మీరు. మీమాట తీసివెయ్యలేక, మీయందున్న అమితమైన ప్రేమచే, ఆపూజును మోయడానికి సిద్ధపడుతోంది

ఆమె. కాని నేనంత కర్కశున్ని కాను. ఆమె నాకన్న ప్రభాకరునికిస్తేనే యెక్కువ సౌఖ్యం పొందుతుంది'

'ఆ దరిద్రునికా'

'ఆ, ప్రేమకు దారిద్ర్యం అడ్డురాదు.'

'నాయనా అనాథయగు యీపిల్లను వివాహంచేసికోడాని కిష్టంలేక ఏదో చెబుతోన్నావు—పోనీ—మా ఖర్మం ఏంచేస్తాము.'

'అలాఅంటే నేనేంచెప్పనూ—పాపం ఆఅమ్మాయి మీయందలి ప్రేమచే ప్రభాకరుని స్నేహాన్నికూడా త్యజించింది. నామాటవిని అతనికే యీమెనివ్వండి—ధనంవిషయంలో నాదీబాధ్యత.'

'ఎంత అపకీర్తి, కూతురుపెండ్లికి డబ్బుయాచించు కుందని నలుగురూ———'

'యాచించుకోవడం ఏమిటీ. కోరి నేను భరిస్తానంటే—'

'వద్దునాయినా యీచిక్కులన్నీ — మాయందు దయవుంటే యీపిల్ల నుద్ధరించు.

* * *

'ప్రభాకరునిదగ్గరనుంచి వుత్తరంవచ్చిందీ—'

'ఆ'

'ఏమని వ్రాశాడూ'

'అతను పిచ్చివాడైపోతోన్నాడు'

'ఏం'

'మీరంటే చాలాకోపంగావుంది ఆయనికి'—

'అవునది సహజమే—పాపం—ప్రభాకరుడు భగ్న హృదయుడు—'

'మీతత్వం తెలీ దతనికి'

'రమ్మని రాయాపోయావు.'

'వ్రాసా'

'అతన్నికూడా తీసికుని వెడదాం బరోడా'

'వస్తాడా'

'నేను చేస్తానుగా ఆయేర్పాటులన్నీని'

'అతనెందుకూ'

'మనదైవర్సుకాగానే అక్కడే పెండ్లిచేసికోవచ్చు మీరు—'

'పెండ్లీవద్దూ పెడాకులూవద్దూ బ్రహ్మచారిణిగా వుండిపోతాను'

'ఏమీ—ప్రభాకరునిగతీ—'

'లేకపోతే లోకం బ్రతుకనిస్తుందీ'

'లోకానికి వెరవడం మనవంటివాళ్ళ లక్షణంకాదు—పాపం నీకై ప్రభాకరుడు వున్మత్తుడైపోయాడు. దీనికంతా వేరుపురుగుని నేనూ. అంచేత నన్నుగురించి అయినా నువ్వు వివాహంచేసికోక తప్పదాతనిని.'

'అబ్బాలోకం—ఇంతలోకం—శిరమువంచి కృంగిపోవాలసిందేగాని—'

'సుశీలా, ఎందుకలాభయపడతావ్ అమాయకంగా-'

'కాలపాశంలా చుట్టుకున్న యీ సాంఘిక శాసనాలూ'

'ఎవరియిష్టంవచ్చినట్టు వారు శాసనాల్ని కల్పించుకోవచ్చు. మనస్వాతంత్ర్యానికీ, మన యిచ్ఛకూ అడ్డువచ్చే శాసనాలు, అవి సాంఘిక శాసనాలైనా, నైతిక శాసనాలైనా, వాటికి మనంయెప్పుడూ విదూరులమయ్యే వుండాలి. మననీతివేరు. మననైతిక శాసనాలువేరు. మనయీ నైతికశాసనాలే మరొక్కరికి అవినీతికరములగు శాసనాలుగా మారిపోవచ్చు. అవినీతికరములైన శాసనాలే మరొకప్పుడు నైతిక శాసనాలుగా మారతాయి. మనిద్దరమూ దాంపత్యభావంతో పెండ్లిచేసికొననేలేదు. ఇప్పటివరకూ ఆమలిన భావం మనలో లేనేలేదు. రెండు ముసలిప్రాణాల్ని రక్షించడానికి అనిత్యములగు అప్పటికి నైతికములగు శాసనాలకి వశమయ్యాం. ఇప్పుడా అడ్డంకి తీరిపోయింది. అంచేత ఆశాసనాల్ని యిప్పుడనుసరింపనవసరంలేదు.'

'మీజీవితం అతివంద్యనీయమైంది. త్యాగనీయమైంది. కడు ప్రశంసనీయమైంది. ఇలాటి వుదారత—సరే మీయిష్టంవచ్చినట్టు కానీండి. నేను మీకు సో—యెవర్ని.'

'మమ్మాటికి సోదరివే. సోదరివగు నిన్ను, పురోహితులు చదివిన ఆ యేవేవో మంత్రాలు భార్యనుగా చెయ్యలేవు.

—కంటిపూడి జానకిరామ శౌదరి.